మహిళలకు ఉచిత బస్సు హుళక్కేనా?

- మరో సూపర్ సిక్స్ హామీ బుట్టదాఖలు
- ఉచిత బస్సు పథకం ఎప్పుడిస్తారంటున్న మహిళలు

దెందులూరు: కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు, ప్రతి నెలా మహిళలకు రూ.1,500, యువతకు నిరుద్యోగ భృతి కింద రూ.3 వేలు అంటూ సూపర్ సిక్స్ హామీలు గుప్పించారు. టీడీపీ, కూటమి నేతలు, సీఎం కుర్చీనెక్కిన చంద్రబాబు నాయుడు తూతూమంత్రంగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ప్రారంభించారు. త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణం అంటూ రవాణా శాఖ మంత్రి ప్రకటించగా, ఇంకో మంత్రి నారా లోకేష్ రోడ్ మ్యాప్ వేద్దాం.. వచ్చే ఏడాది నుంచి పథకాల అమలుపై దృష్టి సారిద్దామని చెబుతున్నారు. హామీలు చూస్తుంటే భయమేస్తుందని ఏకంగా సీఎం చంద్రబాబు చెప్పడంపై అన్ని వర్గాల ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక ఉచిత ప్రయాణం లేనట్టేనా? అని మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత బస్సు ప్రయాణం ఊసెత్తరా?

ఎన్నికల హామీ అమలు చేయకపోవడంపై మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి 7నెలలు దాటినా అతీగతీ లేదంటూ విమర్శలు చేస్తున్నారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్ సిక్స్ పథకాల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒకటి. ఎన్నికల ముందు మహిళలు ఎక్కడికైనా ఉచిత ప్రయాణం చేయొచ్చంటూ విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. టీడీపీ కూటమి నేతలు గద్దెనెక్కి 7 నెలలు గడుస్తున్నా హామీలను పట్టించుకోవడంలేదు. ఉచిత బస్సు ప్రయాణం ఇంకెప్పుడని మహిళలు ప్రశ్నిస్తున్నారు. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఆర్టీసీ ప్రయాణం అమలు చేశాయి. తమిళనాడులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పటినుంచో అమలులో ఉంది. అయితే ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూడా అదే ఫార్ములాను అమలుచేసింది. ఉచిత బస్సు అంటూ జోరుగా ప్రచారం చేపట్టింది. అయితే ఈ హామీ నేటికీ కార్యరూపం దాల్చలేదు. చంద్రబాబు మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టారని స్పష్టం కావడంతో మహిళలు ఉసూరుమంటున్నారు.

స్పష్టత లేదు

మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీపై సీఎం చంద్రబాబు ఇప్పటి వరకు కనీసం స్పష్టత ఇవ్వలేదు. రోడ్డు రవాణా శాఖ మంత్రి మాత్రం త్వరలోనే అని చెప్పడం తప్ప, ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో స్పష్టత ఇవ్వకపోవడం శోచనీయం. తొలుత గత ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి అని అన్నారు. మళ్లీ మహిళలకు దీపావళి కానుకగా ఉచిత బస్సు ప్రయాణం అని వదంతులు సోషల్ మీడియాలో హల్‌చల్ చేసిన విషయం అందరికీ తెలిసిందే. దీనికితోడు ఏకంగా చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలయితే ఇచ్చాం. కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే భయమేస్తుందని వ్యాఖ్యానించడం మహిళల అనుమానాలకు బలం చేకూరుస్తుంది.



ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం విడుదల చేసిన సూపర్ సిక్స్ లోగో


ఆర్టీసీ బస్సు

హామీ ఇచ్చేటప్పుడు భయం కనిపించలేదా?



ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చేటప్పుడు ఆచరణకు సాధ్యమా, అసాధ్యమా అని ఆలోచన చేయాలి. ఎన్నికల్లో గెలిచి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుని ఇప్పుడు హామీలు చేస్తుంటే భయమేస్తుందని చెప్పడం సిగ్గు చేటు. హామీలు ఇచ్చేటప్పుడు చంద్రబాబుకు భయం కనిపించలేదు. టీడీపీకి ఓటు వేసి మహిళలు మోసపోయారు.

– మండలి సరస్వతి, జెడ్పీటీసీ, ఏలూరు

మహిళా మంత్రులు స్పందించాలి



ఎన్నికల ముందు అన్ని ప్రచార సభల్లో కూటమి ప్రధాన నాయకులతో పాటు మహిళా అభ్యర్థులు కూటమి మేనిఫెస్టోను ప్రచారంచేశారు. ఉచిత బస్సు ఇస్తానని ఊదర గొట్టారు. సంవత్సరం అయినా ఉచిత బస్సు సౌకర్యం కల్పించలేదు. ఏడాది గడిచినా మహిళా మంత్రులు మౌనంగా ఉండటం ఆశ్చర్యంగా ఉంది. వెంటనే మహిళామంత్రులు అందరూ స్పందించాలి. ఉచిత బస్సు ఏర్పాటుకు చంద్రబాబును నిలదీయాలి.

– బి.రామసీత, ఎంపీటీసీ, అప్పనవీడు–2

క్లుప్తంగా

మండల పశు వైద్యాధికారిగా హరికృష్ణ



దెందులూరు: మండలం పశు వైద్యాధికారిగా డాక్టర్ మున్నంగి హరికృష్ణ నియమితులయ్యారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన డాక్టర్ రామ్మోహనరావు పెదపాడు మండలం బదిలీ అయ్యారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శాఖాపరమైన లక్ష్యాల సాధన తొలి ప్రాధాన్యంగా అందరి సహాయ సహకారాలతో విధులు నిర్వహిస్తానన్నారు. పశువులకు సంబంధించి ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా, వైద్యశాలకు తీసుకురాలేని పరిస్థితులు ఉంటే సంచార వాహనానికి ఫోన్ చేసి పశు వైద్య సేవలు పొందాలని సూచించారు.

దంత సంరక్షణ కీలకం


విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

దెందులూరు: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణతో పాటు దంత సంరక్షణ కీలకమని సెయింట్ మేరీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ హెచ్ఎం సిస్టర్ టీనా అన్నారు. శుక్రవారం దెందులూరులో సెయింట్ మేరీస్ స్కూల్ విద్యార్థులకు సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాల వైద్యులు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో విద్యార్థులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేశారు. దంతాల సంరక్షణపై సుదీర్ఘంగా విద్యార్థులకు దంత వైద్యులు అవగాహన కల్పించారు.

హిజ్రాలు బాధ్యతగా ప్రవర్తించాలి


హిజ్రాలతో మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్

దెందులూరు: బహిరంగ ప్రదేశాల్లో హిజ్రాలు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని పెదవేగి సీఐ సీహెచ్ రాజశేఖర్ అన్నారు. శుక్రవారం దెందులూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఆర్.శివాజీ ఆధ్వర్యంలో హిజ్రాలకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీఐ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజా భద్రత, సౌకర్యాల కోసం సర్కిల్ పరిధిలో హైవేలపై హిజ్రాల వలన ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకూడదన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, నూజివీడు డీఎస్పీ కేవీవీఎస్ ప్రసాద్ ఆదేశాల మేరకు ప్రజా భద్రత నిర్వహణకు జిల్లా పోలీసులు జాతీయ రహదారులపై శాఖాపరమైన పర్యవేక్షణ ఉంటుందన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టే కార్యకలాపాల్లో నిమగ్నమవుతున్నా, లేదా వాహనదారుల భద్రతకు ముప్పు కలిగించేలా ప్రవర్తిస్తున్నా వారిపై చట్టా ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నూకాలమ్మకు వెండి సమర్పణ

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారికి శుక్రవారం సందర్భంగా ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి వెండి చీర తయారీకి ఇనగడపు రమేష్ కుమార్, ధనలక్ష్మి కుటుంబ సభ్యులు 5 తులాల వెండిని అందజేశారని ఆలయ శాశ్వత చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. శ్రీ నూకాంబిక ప్రసాద వితరణ భక్త బృందం చిట్లూరి సుబ్బారావు నేతృత్వంలో కట్టుపొంగలి, పులిహోర ప్రసాదాలను పంపిణీ చేవారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొమ్మినేని వెంకట రమణ, చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వీవీఎస్ రామారావు, వేముల శ్రీనివాసరావు, అరుణ దంపతులు, వేముల యశ్వంత్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి భీమడోలు మండలం పూళ్ల గ్రామానికి చెందిన పచ్చా శ్రీనివాసరావు శుక్రవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. తొలుత ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తిని కొట్టి గాయపరిచిన నేరానికి ఇద్దరిపై కేసు నమోదు చేశామని హెచ్‌సీ టి.బాబూరావు తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో జంగారెడ్డిగూడెం మండలం కేతవరం గ్రామానికి చెందిన భార్యా భర్తలు మల్లెల్లి మోహన్, రాటాలు నాలుగేళ్లుగా విడిగా ఉంటున్నారు. ఈ నెల 19న పెద్దల సమక్షంలో మాట్లాడుకునేందుకు జంగారెడ్డిగూడెం ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో సమావేశమయ్యారు.మోహన్ తరపు పెద్దలు డోలా రామయ్య, మరికొందరు ఎంఆర్‌పీఎస్ కార్యాలయానికి వచ్చారు. అక్కడికి వచ్చిన రాటాలు, ఆమె వెంట వచ్చిన ఉండి రమేష్‌లు ఒక్కసారిగా రామయ్యపై దాడి చేశారు. దీంతో రామయ్యకు రక్త గాయాలయ్యాయి. అక్కడే ఉన్న వారు వీరిని అడ్డుకుని రామయ్యను ఏరియా ఆసుపత్రికి తరలించారు. రామయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

విద్యార్థుల చేరికలో ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలి


విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈవో–1

భీమడోలు: ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని భీమడోలు ఎంఈవో–1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించి, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను ఆయన పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నందున ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల సంఖ్యను పెంచుకోవాలని ఇన్‌చార్జి హెచ్ఎం మండే సుధాకర్‌కు ఆయన సూచించారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లోకి వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం సన్నబియ్యంతో తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. ఈ నెల 21వ తేదీ అంతర్జాతీయ యోగాను పురస్కరించుకొని ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాల నిర్వహించాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ప్రారంభం

ఉంగుటూరు: మండలంలోని వెల్లమిల్లి పంచాయతీ పరిధిలో పలు చోట్ల నూతనంగా ఏర్పాటు చేసిన నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను శుక్రవారం ఎమ్మెల్యే పి.ధర్మరాజు ప్రారంభించారు. నాయకులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

యోగాతో మారనున్న జీవన విధానం


భీమడోలు: యోగాసనాలు వేస్తున్న చిన్నారులు (ఫైల్)


దెందులూరు: యోగాలో పాల్గొన్న వికార్ జనరల్, కళాశాల కరస్పాండెంట్

భీమడోలు: యోగాసనాలతో జీవన విధానంలో మార్పు రానుంది. యోగా అనేది వ్యాయామకం కాదని ఓ జీవన విధానమని నిపుణులు చెబుతున్నారు. యోగాసనాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పడతాయి. శారీరకంగా మాత్రమే కాకుండా మానసికంగా కూడా శక్తినిస్తాయి. నిత్య జీవితంలో అవి ఒక వెలకట్టలేని భాగంగా మారనున్నాయి. రోజూ హడావుడిగా పనులు, ఒత్తిడితో సతమతమవుతున్న అన్ని వర్గాల వారికీ యోగాసనాలు ఆరోగ్యాన్ని అందిస్తాయి. ప్రతి రోజూ ఒక గంట యోగాసనాలు వేసి తమ పనుల్లో నిమగ్నమైతే వారి ఆయుస్సుకు ఢోకా ఉండదని యోగా నిపుణులు చెబుతున్నారు. ఈ నెల 21వ తేదీ శనివారం ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి సచివాలయం వద్ద యోగా డేను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

విన్యాసాలతో మైమరపించిన విద్యార్థులు

పెదవేగి: నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కొప్పాక, విజయరాయి, పెదవేగి, గార్లమడుగు ఓరియంటల్ హైస్కూల్, దుగ్గిరాల సెయింట్ జోసఫ్ దంత కళాశాలలో, భోగాపురం విజ్ఞాన్ గ్లోబల్ జెన్, పెదవేగి ఎస్ఎంసీ, దెందులూరు బాలసదనంలో ఈ యోగా దినోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కామన్ యోగా ప్రోటోకాల్, ప్రాణాయమం, వజ్రాసనం, శేషాసనం, నౌకాసం, మయూరాసనం, కుక్కుటాసనం, వంటి ఆసనాలు వేసి వాటి ప్రాముఖ్యతను వివరించారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యోగా అనే ఆకృతిలో విద్యార్థులు కూర్చున్న చిత్రం పలువురిని ఆకర్షించింది.


నిడమర్రు: తోకలపల్లి పంచాయతీలో యోగాసనాలు వేస్తున్న ప్రజలు

శ్వాస మీద ధ్యాస పెడితే ఎన్నో ప్రయోజనాలు

నిడమర్రు: శ్వాస మీద ధ్యాస ఉంచి పట్టు సాధిస్తే శ్వాస సంబంధ వ్యాధులు రావని అలాగే యోగా వలన బహుళ ప్రయోజనాలు చేకూరతాయని యోగా మాస్టర్ ట్రైనర్ పీవీ పెద్దిరాజు అన్నారు. శుక్రవారం నిడమర్రు మండలం తోకలపల్లి పంచాయతీలో ప్రజల చేత యోగా తరగతులు నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సెక్రటరీ, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

147 ప్రదేశాల్లో యోగా

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో 147 ప్రదేశాలలో యోగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజ్ మనోజ వెల్లడించారు. ఉదయం 6 నుంచి గంట పాటు యోగా ప్రక్రియలు చేయిస్తారని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల వద్ద యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో యోగా ప్రియులు, ప్రజలు, ఉద్యోగులు, యువత, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


పెదవేగి: యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

28,500 మందితో యోగాంధ్ర

దెందులూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా శనివారం దెందులూరు మండలంలో ఉదయం 6:30 గంటలకు యోగాంధ్ర కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీడీవో కె.శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో నమోదైన ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, యువత, మహిళలు, స్వచ్ఛంద సంస్థలు మొత్తం 28,500 మంది యోగాంధ్రలో పాల్గొంటారని తెలిపారు.

సెయింట్ జోన్స్ బీఈడీ కళాశాలలో యోగా

యోగాతో శారీరక మానసిక ప్రశాంతత, ఆరోగ్యం లభిస్తుందని ఆర్‌సీఎం ఏలూరు పీఠం వికార్ జనరల్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.బాల అన్నారు. శుక్రవారం సోమవరప్పాడు సెయింట్ జోన్స్ బీఈడీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ సాల్మన్ రాజు, బీఈడీ విద్యార్థులతో యోగ సాధన చేయించారు. వికార్ జనరల్ డాక్టర్ బాల మాట్లాడుతూ యోగా ప్రతి ఒక్కరి జీవితంలో ప్రతిరోజు తప్పనిసరి దినచర్య కావాలన్నారు.

రెవెన్యూ సేవలను ప్రజలకు చేర్చాలి


తహసీల్దార్ బి.రమాదేవిని సత్కరిస్తున్న వీఆర్వోలు

భీమడోలు: రెవెన్యూ వ్యవస్థలో వీఆర్వోల పాత్ర కీలకమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలులో రెవెన్యూ డేను పురస్కరించుకొని శుక్రవారం వీఆర్వోలు, రైతులకు రెవెన్యూ సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు కందులపాటి శంకర్ అధ్యక్ష వహించారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ బి.రమాదేవి, భీమడోలు ఏఎంసీ చైర్మన్ శేషపు గిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసిల్దార్ బి.రమాదేవి మాట్లాడుతూ రెవెన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై విస్తృత ప్రచారం చేయాల్సిన బాధ్యత వీఆర్వోలపై ఉందన్నారు. వీఆర్వోలు కందులపాటి శంకర్, శేషు తదితరులు మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు కానున్న క్లస్టర్ విధానంలో ఇప్పటి వరకు ఉన్న వీఆర్వోల సంఖ్య గణనీయంగా తగ్గుతుందన్నారు. మండల వ్యాప్తంగా 16 మంది వీఆర్వోలు ఉండగా 9 మందికి తగ్గుతాయన్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న పని ఒత్తిడికి సిబ్బంది కూడా తగ్గితే తమ పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం పంచాయతీకి ఒకరు చొప్పున వీఆర్వోలను నియమించేలా చర్యలు తీసుకోవాలని వాపోయారు. అనంతరం తహసీల్దార్ బి.రమాదేవిని ఘనంగా సత్కరించారు. ఉత్తమ వీఆర్వో గంధం మార్కేండేయులు, వీఆర్ఏలను దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీటీ రంగలక్ష్మి, రీసర్వే డీటీ కామేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ నిమ్మకాయల గణ, సాగునీటి సంఘం అధ్యక్షుడు కుక్కల ప్రసాద్, పైడిమాల యుగంధర్, ప్రవీణ్‌కుమార్ పటేల్, మూర్తి, ఆదిరెడ్డి సత్యనారాయణ, పులిచర్ల కృష్ణారావు, పాకిన సత్యనారాయణ, వీఆర్వోలు వినయ్, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలి

దెందులూరు: రెవెన్యూ శాఖలో ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని తహసీల్దార్ సుమతి అన్నారు. రెవెన్యూ శాఖలో తొలిసారిగా రెవెన్యూ డే నిర్వహించడం సంతోషంగా ఉందని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. శుక్రవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే నిర్వహించారు. డీటీలు శ్రీనివాస్, కృష్ణదాసు, ఆర్ఐ హేమమాలిని, వీఆర్ఓలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

ఉంగుటూరు: రెవెన్యూ శాఖ ప్రజలకు అత్యంత సమీపంగా ఉండే వ్యవస్థ అని, ఈ వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే అన్నారు. ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఏఎంసీ చైర్మన్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: మలేరియా జ్వరాలపై విద్యార్థులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి బీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం కొవ్వలిలో ఫ్రైడే–ఫ్రైడే అవగాహన ర్యాలీ సమీక్షా సమావేశం నిర్వహించారు. చలితో కూడుకున్న జ్వరం మలేరియా కావొచ్చని అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయమని మలేరియా జ్వరాలు వర్షా కాలంలో ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో ఎక్కువగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని విద్యార్థులు మలేరియా జ్వరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పోతునూరు ఆరోగ్య కేంద్రం కొవ్వలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులకు మలేరియా జ్వరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జ్వరం వస్తే ఆరోగ్య కేంద్రాన్ని, ఆశా కార్యకర్తను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, ఆరోగ్య విస్తరణ అధికారి పొన్నాడ ప్రభాకర్‌రావు, హెల్త్ అసిస్టెంట్లు మేకా శ్రీనివాసరావు, సురేష్ ఆరోగ్య కార్యకర్తలు సరిత, శారరోజ్, ఎంఎల్‌హెచ్‌పీ ప్రవల్లిక, నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ దిగ్బంధంలో ఉంగుటూరు


గాంధీబొమ్మ సెంటర్‌లో స్తంభించిన ట్రాఫిక్



చల్లాలమ్మ గుడి సెంటర్‌లో ట్రాఫిక్ జామ్

మఉంగుటూరు: ఉంగుటూరులో వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పరిస్థితి నెలకొంది. అసలే ఇరుకు వంతెన దానికి తోడు గణనీయంగా పెరిగిన వాహనాలతో గ్రామస్తులు ఊరిలో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం ట్రాఫిక్‌తో ప్రతి పావు గంటకు దిగ్బంధం ఏర్పడింది. నారాయణపురం వంతెనకు రంధ్రం పడటంతో నాలుగైదు రోజుల నుంచి ఆ వంతెనపై వాహనాల రాకపోకలను నిలుపుదల చేశారు. దీంతో భీమవరం వైపు నుంచి వచ్చే వాహనాలు నారాయణపురం రాజుల కాలనీ వద్ద నుంచి పొలాల మీదుగా ఉన్న పుంత రహదారి మీదుగా ఉంగుటూరుకు చేరుకుంటున్నాయి. అలాగే టోలు ప్లాజా ఎగవేతదారులు అందరూ ఉంగుటూరు వంతెన మీదుగా తిప్పుతున్నారు. అలాగే మెట్ట ప్రాంతం నుంచి కంకర, మట్టి లారీలు వందలాదిగా ఉంగుటూరు వంతెన మీదుగా నడుపుతుండటంతో వంతెన వద్ద విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది. శుక్రవారం రోజంతా ఈ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో ప్రధాన వీధిలో సమస్యతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ప్రజలు పాలకులను తిట్టుకుంటూ తిరుగటం వారి వంతయింది. దీంతో దుమ్ము రేగడంతో ప్రజలు ముక్కు మూసుకొని తిరిగారు. వంతెన దాటడానికి ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. ఈ సమస్య తీరేదెన్నడోనని గ్రామస్తులు వాపోతున్నారు. అయినా కూటమి నాయకులు మాత్రం ఇవేమీ మాకు పట్టవన్నట్లు వ్యవహరిస్తున్నారు. పోలీసులు కాసేపు ఉండి ట్రాఫిక్ క్రమబద్ధీకరించి వెళ్లిపోతున్నారు. ప్రజలు మాత్రం విపరీతంగా తిరిగే వాహనాలు తరుచు ఉత్పన్నమవుతున్న ట్రాఫిక్ సమస్యతో నరకం చూస్తున్నారు.

తహసీల్దార్‌ను శాశ్వతంగా నియమించాలి

ఉంగుటూరు: తహసీల్దార్‌గా శాశ్వతంగా ఒకరు ఉండడం లేదు. కూటమి ప్రభుత్వ పాలనలో తహసీల్దార్‌ను నియమించలేకపోతున్నారు. నియోజకవర్గ ప్రజా ప్రతినిధికి అనుకూలమైన వేరే మండల తహసీల్దార్ కోసం ఉంగుటూరు తహసీల్దార్ పోస్టును ఖాళీ చేశారని చర్చించుకుంటున్నారు. అయితే చాలా నెలల నుంచి ఈ మాట వినిపిస్తున్నా ఇప్పటికీ శాస్వతంగా ఎవరినీ నియమించకపోవడం శోచనీయం. డీటీగా పని చేసే బొడ్డేపల్లి దుర్గా ప్రసాద్‌కు 2024 అగస్టు 28న పూర్తి స్థాయి అదనపు చార్జి ఇచ్చారు. ఆ తరువాత పూర్ణచంద్రప్రసాద్‌ను తహసీల్దార్‌గా నియమించారు. ఆయన 2025 మార్చి 31 వరకు పని చేశారు. ఆ తరువాత అమరావతి సచివాలయం నుంచి తహసీల్దార్‌గా రవికుమార్ నియమితులయ్యారు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 18 వరకు ఆయన ఇక్కడ తహసీల్దార్‌గా పని చేశారు. ఇపుడు రవికుమార్‌కు కృష్ణా జిల్లాకు పోస్టింగు ఇచ్చారు. బదిలీ అయిన ఆయన స్థానంలో కొత్త తహసీల్దార్‌ను నియమించలేదు.

కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను విడనాడాలి

చింతలపూడి : కూటమి ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగుల వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ డిమాండ్ చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం కార్మికులు ఉద్యోగుల పని గంటల పెంపు, మహిళా ఉద్యోగ కార్మికులు రాత్రి సమయాల్లో పనిచేసే విధానాన్ని అమలుచేస్తూ నిర్ణయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని, మహిళల భద్రత చట్టాలను పక్కనపెట్టి పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు లాభం చేకూర్చే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడాన్ని నిరసిస్తూ స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ సరోజిని, టి.మాణిక్యం, జి.సరళ దేవి, కె.కవిత, ఎం అరుణకుమారి, వై.సీతా మహాలక్ష్మి, పలు మహిళా సంఘాల కార్మికులు పాల్గొన్నారు.